# ఆటో డ్రైవర్ల ఆందోళన

- కోరుట్లలో నిరసన, ర్యాలీ
- ఆర్డీవోకు వినతి పత్రం అందజేత


కోరుట్లలో జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కోరుట్ల, డిసెంబర్ 15: పట్టణంలో శుక్రవారం టాటా మ్యాజిక్, ఆటో యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆందోళన చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి జాతీయ రహదారి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వాసు, శివలాల్, గంగాధర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 15: ఈ నెల 29న ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో జిల్లాస్థాయి సాంస్కృతిక, యువజనోత్సవ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించిన కళాకారులకు జానపద నృతం (గ్రూప్), జానపద నృత్యం (సోలో), జానపద పాట (గ్రూప్), జానపద పాట (సోలో), లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ (కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ) పోటీల్లో ప్రతి అంశంలోని విజేతలను నిర్ణయించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల లోపు ఉండి, పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రి కళాకారులు తమ వెంట తీసుకొని రావాలని సూచించారు. అదేవిధంగా జానపద నృత్య బృందంలో 10 మంది సభ్యులు ఉండి 15 నిమిషాల గరిష్ట కాలపరిమితి మించకుండా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లి, డిసెంబర్ 15: అక్రమంగా నాలుగు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా మెట్‌పల్లి పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ చిరంజీవి నేతృత్వంలో పోలీసులు రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టణ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లను రెవెన్యూశాఖకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మద్యం మత్తులో యువకుల వీరంగం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 15: తిప్పన్నపేట గ్రామంలో మద్యం మత్తులో కొంతమంది యువకులు వీరంగం సృష్టించారు. వివరాల్లోకెళ్తే, తిప్పన్నపేటలో కొంతమంది యువకులు కొన్ని రోజులుగా మద్యం తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం నలుగురు యువకులు తిప్పన్నపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద మద్యం తాగి వీరంగం సృష్టించారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

జగిత్యాల, డిసెంబర్ 15: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తపాలా శాఖలోని గ్రామీణ డాక్ సేవక్‌ల సమ్మె శుక్రవారం నాల్గోరోజు కొనసాగింది. జగిత్యాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట వివిధ గ్రామాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. 7వ వేతన సవరణ సంఘం ఇచ్చిన నివేదికలో ఉన్న డిమాండ్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కాలగిరి శ్రీనివాసరెడ్డి, రమపతిరావు, చెంగలి గంగాధర్, రాజేందర్, జ్ఞానేశ్వర్, చాంద్, లక్ష్మీరెడ్డి, లక్ష్మణ్, రాజశేఖర్, గణేశ్, రాజేశం, కొండయ్య, మాణిక్యం, ప్రసాద్, జహరుద్దీన్, రౌత్ నర్సయ్య, బొజ్జ నర్సయ్య, ధర్మపురి రమేశ్, చిక్రమ్ భీంరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీ.. ఐదుగురికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 15: మెట్‌పల్లి – కోరుట్ల మధ్య పెద్దగుండు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే.. కరీంనగర్‌కు చెందిన హేమావతి నెల రోజుల క్రితం ప్రసవించగా, ఓ పాపకు జన్మనిచ్చింది. కరీంనగర్ నుంచి ఆమె పుట్టినిళ్లయిన ఆర్మూర్‌కు తల్లి సుగుణాదేవితో కలిసి కారులో వెళ్తుంది. కోరుట్ల – మెట్‌పల్లి మధ్యన గల పెద్దగుండు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా మరో కారు వస్తుంది. శుక్రవారం సాయంత్రం రెండు కార్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. సంఘటనలో ఆర్మూర్ వైపు వెళ్తున్న హేమావతి, సుగుణాదేవితో పాటు కారు డ్రైవర్ రాముకు తీవ్ర గాయాలు కాగా, పాపకు ఎలాంటి దెబ్బలు తగలలేదు. ఎదురుగా వస్తున్న కారులోని కోరుట్ల పట్టణానికి చెందిన ఇద్దరికి సైతం గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోరుట్ల ప్రభుత దవాఖానకు తరలించగా, మెరుగైన చికిత్స కోసం జగిత్యాల దవాఖానకు తీసుకెళ్లారు.

# జిల్లాలో ఏసీఈఆర్‌టీ బృందం పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారులు మనోహరాచారి, శ్రీనివాస్

జగిత్యాల టౌన్, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్య, అకాడమిక్ కార్యక్రమాలను ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర మానిటరింగ్ అధికారులు మనోహరాచారి, శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్య, అకాడమిక్ కార్యక్రమాలను పరిశీలించి, వీటి అమలులో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు, అవసరమైన సహకారం ఇచ్చేందుకు ప్రతి నెలా అకాడమిక్ మానిటరింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తాను బోధించే ప్రతీ తరగతి బోధనా అంశాలను తర్వాత పీరియడ్‌లో సాధన చేయించాలని చెప్పారు. అదేవిధంగా తరగతి గదిలో బోధనను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గ్రంథాలయానికి ప్రత్యేక పీరియడ్ నిర్వహించాలని ఉన్నతి అమలుకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో బృంద సభ్యులు కే మనోహరాచారి, ఈర్షద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశ్, బాలకిషన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం


కోరుట్ల: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కోరుట్ల, డిసెంబర్ 15: పట్టణంలోని పురాతనమైన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి రంగురంగుల దీపాలను అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బీర్నంది లక్ష్మీనర్సింహాచార్యులు వైదిక నిర్వహణలో పద్మావతీ, గోదాదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. జనవరి 17వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి విక్రమ్ తెలిపారు. ఆలయంలో వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి), లక్ష పుష్పార్చన, వన మహోత్సవం, కుడారై ఉత్సవం, గోదా, రంగనాయకుల కల్యాణం, ఉంజల్ సేవా, ఏకాంత సేవ పూజలు జరుగుతాయని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ధర్మపురిలో నేటి నుంచి..

ధర్మపురి, డిసెంబర్ 15: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో శనివారం నుంచి ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 16 నుండి వచ్చే నెల 14వ వరకు ప్రధాన దేవాలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 23న ఉదయం 3 గంటల నుంచి ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే జనవరి 13న ఉదయం 11 గంటలకు శేషప్ప కళావేదికపై గోదాకల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు.

## కార్మికులకు రక్త పరీక్ష

సారంగాపూర్, డిసెంబర్ 15: కోనాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. లేబర్ కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, సర్పంచ్ ఆకుల జమున, కార్యదర్శి శ్రీనివాస్, నిర్వాహకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి 12:30 గంటల వరకు 33/11 కేవీ ధరూర్ క్యాంప్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, కొత్త 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా జగిత్యాల టౌన్–3 సెక్షన్ పరిధిలోని భవానీనగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టర్ రెసిడెన్స్, కరీంనగర్ రోడ్, రామాలయం ఏరియా, ధరూర్ క్యాంపు, చర్చి ఏరియా, అయ్యప్ప కాలనీ, బుడగజంగాల కాలనీ, వద్ధనాయక బ్యాంక్, హైటెక్ కాలనీ, శాంతినగర్ , అంతర్గాం రోడ్, గణేశ్‌నగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఎండీ రహీం తెలిపారు. శనివారం ఉదయం 8:30 నుంచి 12:00 గంటల వరకు తాటిపెల్లి, తారమామనగర్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా వాటి సబ్ స్టేషన్ల పరిధిలోని తాటిపెల్లి, టీఆర్‌నగర్ , నర్సింగాపూర్, వంజరిపల్లి, ధరూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు వాటర్ వర్క్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని హస్నాబాద్, లింగంపేట్ గ్రామాలకు చెందిన అన్ని రంగాల వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

## 'రైస్ మిల్ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి'

రాయికల్, డిసెంబర్ 15: పట్టణంలోని వదో వార్డులో జనవాసాల మధ్య ఉన్న రైస్ మిల్ వల్ల చుట్టుపక్క ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రైస్ మిల్ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజలు తహసీల్దార్ ఖయ్యూం, పురపాలక కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, రైస్ మిల్లు నుంచి అధికంగా దుమ్ము, ధూళితో గాలి కలుషితమై చిన్న పిల్లలు, పెద్దలకు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో నిగ గంగరాజం, భూమయ్య, బాపురపు రాజీవ్, డీఎస్‌పీ మండల అధ్యక్షులు పాలెపు జీవన్, నిఘా స్వామి గంగరాజం, లింగంపల్లి సిద్దార్థ, మారంపెల్లి రాకేశ్, బత్తిని అభిషేక్, లింగంపల్లి అస్విత్, దొనకంటి రాజేందర్, ఆశమ్మ, లింగంపెల్లి నర్సు, అగ్గిమల్ల సందమ్మ, నిఘా సుశీల, నిఘా గంగు, సాయమ్మ, పోచవ్వ, రాధ, రజినీ, తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 15: చెర్లకొండాపూర్ గ్రామంలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గీత కార్మికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల అంజయ్యగౌడ్ అనే గీత కార్మికుడు కల్లు గీస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వృత్తిలో భాగంగా శుక్రవారం కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు పైకి ఎక్కగా, ప్రమాదవశాత్తు మోకు జారిపోవడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో చేతికి, తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జగిత్యాల దవాఖానకు తరలించగా, కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. కాగా బాధితుడ్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల భూమాగౌడ్, నాయకులు ఆరెళ్ల రాజాగౌడ్, జగన్‌గౌడ్, గీత కార్మికులు కోరుతున్నారు.

## గల్ఫ్ వలస కార్మికులకు ఉచిత ఉపాధి శిక్షణ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 15: గల్ఫ్ వలస కార్మికులకు ఉచిత ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు ఐవోఎం సౌజన్యంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ న్యాక్ ఆధ్వర్యంలో విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్స్ 30 మందికి, జనరల్ ప్లంబర్స్ 50 మందికి, తాపీ మేస్త్రీ 60 మందికి, సెంట్రింగ్ కార్పెంటర్ 50 మందికి , బార్ బిల్డింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్‌లో 60 మందికి 15 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గల గల్ఫ్ కార్మికులు ఈనెల 18 సాయంత్రం 5 గంటల వరకు జగిత్యాల ఎంప్లాయిమెంట్ కార్యాలయం కలెక్టరేట్ రూం నంబర్ 218లో లేదా న్యాక్ సెంటర్ నూకపెల్లిలో లేదా రాయికల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94913 22556, 70367 23800, 99630 50734 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిలు కాయితి శంకర్, మార్వాడి సుదర్శన్, న్యాక్ ఏడీ గోలి రమేశ్ పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా

జగిత్యాల రూరల్, డిసెంబర్ 15: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సభకు కావాల్సిన సభ్యుల కోరం లేనందున మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి ప్రకటించారు.

## లలితామాత ఆలయంలో పారాయణం

జగిత్యాల, డిసెంబర్ 15: పొలాసలోని 108 శ్రీ చక్రసహిత లలితామాత ఆలయంలో మహిళలు లలితా సహస్రనామ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్‌పర్సన్ చెల్లం స్వరూప–సత్తయ్య ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రతిష్ఠించిన 108 శ్రీ చక్రాలకు సుహాసినులు కుంకుమ పూజ చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.